## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కొందుర్గు, మార్చి 5: బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని పర్వతాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త చంద్రబాబు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే రూ.10వేలు బీఆర్‌ఎస్ నేతల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, రాంచంద్రయ్య, జనార్దన్‌గౌడ్, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

### మాడ్గులలో..

మాడ్గుల, మార్చి5: మెదక్ జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో 13 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న సీఆర్పీలు శ్రీనివాస్, రమేశ్ నాయక్ విధి నిర్వహణలో ఉండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాడ్గుల మండల సీఆర్పీలు, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం రూ.30వేలు అందజేశారు. కార్యక్రమంలోని ఎంఈవో సర్దార్‌నాయక్, హెచ్‌ఎంలు సుదర్శన్, పర్వతాలు, బాలనారాయణ, సీఆర్పీల మండల అధ్యక్షుడు యాదగిరి, మధు, జలందర్, తిరుపతి, లక్ష్మయ్య, స్వాతి ఉన్నారు.

### యాచారం మండలంలో..

యాచారం : మండంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త రషీద్ తండ్రి రసూల్ అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన జాగృతి యూత్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రవిగౌడ్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రూ.15,000, బీఆర్‌ఎస్ పార్టీ తరపున రూ.5,000 ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. వీరి వెంట జాగృతి యూత్ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్లటౌన్, మార్చి 5: పెండింగ్ కేసుల పరిష్కారం కోసం కొనసాగుతున్న లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు అన్నారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్సై చంద్రనాయక్, పోలీసులు సిబ్బంది, కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులపై పనిభారం తగదు

### ఇబ్రహీంపట్నం డిపో ఎదుట నిరసన వ్యక్తం చేసిన ఆర్టీసీ కార్మికులు



ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, కార్మికసంఘాల నాయకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 5 : ఆర్టీసీ కార్మికులపై యాజమాన్యం అధిక పనిభారం మోపి వేధిస్తూ...కార్మికులను చిన్నచూపు చూస్తూ హక్కులను కాలరాస్తున్నదని ఆర్టీసీ కార్మికులు బుధవారం ఇబ్రహీంపట్నం డిపో ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాస్, శ్రీశైలం మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలు విస్మరించినందున సమ్మెలో భాగంగా సమ్మె సన్నాహక కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఇబ్రహీంపట్నం డిపోలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల డిమాండ్ నెరవేర్చకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికసంఘాల నాయకులు సురేశ్, రవి, దర్శన్, మకట్‌లాల్ పాల్గొన్నారు.


## ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



సైన్స్ ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

యాచారం, మార్చి5: మండలంలోని నందివనపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు చూపరులను ఎంతగానో అలరించాయి. విద్యార్థులు ప్రదర్శించిన ఏఐ టెక్నాలజీ, సెల్ఫీ పాయింట్, బిందు సేద్యం, సమీకృత వ్యవసాయం, భూకంపాలను తెలియజేసే అలారం, చంద్రయాన్ సోలార్ ఎనర్జీ, భూఅంతర్ నిర్మాణం, మానవ హక్కులు తెలియజేసే చార్టులు తదితర ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మండల విద్యాధికారి పాండురంగారెడ్డి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించారు. విద్యార్థుల మేధస్సును ఎంతగానో అభినందించారు. విద్యార్థులు సైన్స్ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## మజీద్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం



అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 5 : మజీద్‌పూర్ గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం ఫైన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కుంచారం నిఖిలేశ్‌గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో 20 మంది వైద్యులు, ఫైన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వెంకటేశ్, వెంకటేశ్, కరుణాకర్, వెంకటేశ్, సాయికిరణ్, బాలయ్య, రమేశ్ పాల్గొన్నారు.

# పకడ్బందీగా 'ఇంటర్' పరీక్షలు

**మొదటి రోజు ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు**
**పలుచోట్ల గైర్హాజరైన విద్యార్థులు**
**పరీక్షా కేంద్రాల వద్ద తనిఖీలు చేసిన ప్రత్యేక అధికారులు**



షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న నిర్వాహకులు



షాద్‌నగర్ పట్టణంలోని పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్‌ను సరి చూసుకుంటున్న విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 5: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం సజావుగా ప్రారంభమయ్యాయి. షాద్‌నగర్ పట్టణంలో 4కేంద్రాలతో పాటు ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద జూనియర్ కళాశాల, కమ్మదనం గురుకుల కళాశాలలో పరీక్షలు కొనసాగాయి. 2031మంది సాధారణ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉన్నప్పటికీ, 1952మంది విద్యార్థులు హాజరు కాగా, 79మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదే విధంగా 573మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉన్నప్పటికీ 517మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరు కాగా, 56మంది గైర్హాజరయ్యారు. దీంతో మొత్తం 135మంది గైర్హాజరైనట్లు కస్టోడిన్ వి. శ్రీకాంత్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 408మంది విద్యార్థులకు 392మంది, మొగిలిగిద్ద జూనియర్ కళాశాలలో సాధారణ విద్యార్థులు 273మందికి గాను 258, ఒకేషననల్ 38మందికి గాను 33మంది విద్యార్థులు, కమ్మదనం గురుకులలో 378మంది విద్యార్థులకు గాను 368మంది విద్యార్థులు, ప్రతిభ కళాశాలలో 363మంది విద్యార్థులకు గాను 352మంది, విశ్వభారతీ కళాశాలలో సాధారణ విద్యార్థులు 123మందికి 118మంది విద్యార్థులు, ఒకేషనల్ 535మంది విద్యార్థులకు గాను 484మంది విద్యార్థులు, విజ్ఞాన్ కళాశాలలో 486మందికి గాను 464మంది మొదటి రోజు పరీక్షకు హాజరు కాగా అందులో మొత్తం 135మంది గైర్హాజరయ్యారు.

**ఐదుగురు గైర్హాజరు**

యాచారం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రంలో బుధవారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఐదుగురు గైర్హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు తెలిపారు. మొత్తం 183మంది హాజరు కావాల్సి ఉండగా, 178మంది హాజరైనట్లు తెలిపారు. 5మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ఆయన పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాన్ని సీఐ నందీశ్వర్‌రెడ్డి సందర్శించి పరీక్షలు కొనసాగుతున్న తీరును పరిశీలించారు.

**చేవెళ్లటౌన్ :** మండల కేంద్రంలో నాలుగు పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. చేవెళ్ల ప్రభుత్వ జూనియార్ కళాశాలలో 234 మందికి గానూ 11 మంది గైర్హాజరయ్యారని, చేవెళ్లలోని చైతన్య జూనియార్ కళాశాలలో 271 మందికి గానూ 16 మంది గైర్హాజరు కాగా, వివేకానంద జూనియర్ కాలేజీలో 262 మందికి ఐదుగురు గైర్హాజరయ్యారు. చేవెళ్ల మాడల్ జూనియర్ కాళాశాలలో 138 మందికి ఆరుగురు గైర్హాజరయ్యారు. మొత్తం నాలుగు కేంద్రాల్లో 1229 మంది విద్యార్థులకు గాను 45 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, 1184 మంది హాజరైనట్లు కస్టోడియన్ అధికారి పేర్కొన్నారు.

**కేశంపేట :** మండల పరిధిలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాటిగడ్డ కేజీబీవీ, జేపీ దర్గా ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలకు చెందిన విద్యార్థులు మొదటిరోజు బుధవారం పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాన్ని కేశంపేట తహసీల్దార్ ఆజంఅలీ పరిశీలించారు. 186మందికి గానూ నలుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్ తెలిపారు.

**ఆమనగల్లు :** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రంలో మొత్తం 257 మందికి గానూ 11 మంది గైర్హాజరయ్యారని పర్యవేక్షకులు మాధవరావు, అనంతరెడ్డి తెలిపారు.

**మంచాల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ పరీక్షలకు మొదటి సంవత్సరానికి గానూ 296మందికి 17మంది గైర్హాజరు అయినట్లు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ పూర్ణిమ బుధవారం తెలిపారు. కస్తూర్బా కళాశాల, ఆరుట్ల ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు.

**మొయినాబాద్ :** మున్సిపాలిటీ కేంద్రంలోని చాలెంజర్ పాఠశాలలో 438 మందికిగానూ 431 మంది పరీక్ష రాశారు. చిలుకూరు రెవెన్యూ పరిధిలోని షాహీన్ జూనియర్ కళాశాలలో 299 మందికి 294 మంది, పెద్దమంగళారం రెవెన్యూ పరిధిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో 481 మందికి గాను 476మంది, హిమాయత్‌నగర్ గ్రామంలోని ఎన్‌టీఆర్ జూనియర్ కళాశాలలో 556 మందికి 552 మంది, చిలుకూరు గ్రామ రెవెన్యూలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో 438 మంది విద్యార్థులకు గాను 433 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.



యాచారంలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ నందీశ్వర్‌రెడ్డి



చేవెళ్లటౌన్: పరీక్షా వద్ద తనిఖీ చేస్తున్న దృశ్యం



మంచాలలో పరీక్షా కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు



మొయినాబాద్‌లోని పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూస్తున్న విద్యార్థులు



## ఘనంగా స్వయం పరిపాలన

ఇబ్రహీంపట్నం, మార్చి 5 : మండల పరిధిలోని దండుమైలారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి మిత్రులకు పాఠాలు బోధించారు. అనంతరం స్వయం పరిపాలనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎంఈవో పాండు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జ్యోతి, మాజీ కౌన్సిలర్ విజయ్, హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు చందర్, సరస్వతీ, చెన్నకేశవరెడ్డి, వెంకట్‌నారాయణ, భాస్కర్, జగన్మోహన్, శర్మ, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఆమనగల్లు, మార్చి 5

## 54వ రోజుకు చేరిన రిలే దీక్షలు

చేవెళ్ల రూరల్, మార్చి 5 : శంకర్‌పల్లి మండలం కొండకల్, వెలిమెల తండా శివారులోని లంబాడ గిరిజన ప్రజలు తమ 80 ఎకరాల బిలాదాఖల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 54వ రోజుకు చేరాయి. బుధవారం దీక్షలో పాల్గొన్న భూ బాధితులు మాట్లాడుతూ.. పలు రియల్ ఎస్టేట్ కంపెనీల వారు తమకు సంబంధించిన భూములను ఆక్రమించారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీక్షలో పి.లక్ష్మణ్, రవి, శంకర్, బాబు, లక్ష్మణ్, చందర్‌రెడ్డి, గోపి, సోనీబాయి, వసుంధర, తులసి, గోమా, మున్న, శంకరమ్మ, మాణెమ్మ, పి.కవిత, వెంకటయ్య, శాంతయ్య, కొండకల్ మాజీ వార్డు సభ్యుడు, బీఆర్‌ఎస్ నాయకుడు మర్రివాగు రాజు, తండావాసులు పాల్గొన్నారు.

## కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మొయినాబాద్, మార్చి 5 : కాలనీలో నెలకొన్న సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. బుధవారం మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలోని భరద్వాజా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ మేనేజర్ జమీర్ హైమద్‌కు వినతిపత్రం అందించారు. అంతర్గత మురుగు కాలువలు లేని కారణంగా మురుగు నీరు రోడ్ల మీద పారుతున్నదని, దీంతో దుర్వాసన వెదజల్లి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు లేక ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. కాలనీలో చాలా ఇండ్లకు ఇంటి నంబర్లు కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారులు గురువారం కాలనీకి వచ్చి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సయ్యద్ సలీమ్, జాయింట్ సెక్రటరీ ఘఫర్, కార్యనిర్వహణ కార్యదర్శులు ఎండీ జహంగీర్, రవిరాజ్ సాగర్, కోశాధికారి నర్సింహులు, రమేశ్‌నాయక్, ఇన్‌చార్జి పరిశీలకుడు జైపాల్‌రెడ్డి, కమ్యూనికేషన్ ఇన్‌చార్జి నరేశ్, సభ్యులు రఘురాంరెడ్డి, రఘు, అమీత్ జాదవ్, సాజిద్, జయరాం రెడ్డి, మహరాజ్ పాల్గొన్నారు.



## రైతు వ్యతిరేక విధానాన్ని రద్దు చేయాలి

చేవెళ్లటౌన్, మార్చి 5: కేంద్ర పాలకులు తీసుకువచ్చిన రైతు వ్యతిరేక జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభులింగం అధ్యక్షతన రైతు వ్యతిరేక జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని బుధవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కేంద్ర పాలకులు తీసుకువచ్చిన రైతు వ్యతిరేక జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో రద్దు చేయాలని తీర్మానించాలని అన్నారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దు చేసి, పంటలకు మద్దుతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, రుణమాఫీ చట్టాన్ని చేయాలని, విద్యుత్‌ను ప్రైవేటీకరించవద్దన్నారు. కౌలు రైతులకు సంక్షేమ పథకాలన్నింటిని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, జిల్లా నాయకులు శివుడు, నారాయణరెడ్డి, సత్తిరెడ్డి, సరసయ్య, సుభాన్‌రెడ్డి, అంజయ్య, సుధీర్, అమృత పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న టీఎస్‌ఎస్‌వో వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనివాస్, తదితరులు

ఆమనగల్లు, మార్చి 5: తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్‌ఎస్‌వో) ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన పదో తరగతి టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం పట్టణంలోని మానస గార్డెన్‌లో టీఎస్‌ఎస్‌వో రాష్ట్ర కోఆర్డినేటర్ సుదర్శన్ ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీఎస్‌ఎస్‌వో వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనివాస్, జర్నలిస్టు శ్రీదేవి, మండల విద్యాధికారి పాండు, సెన్సార్ బోర్డు సభ్యుడు చంద్రశేఖర్ హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టాలెంట్ టెస్టులో ప్రథమ బహుమతి సాధించిన లిటిల్ స్కాలర్ టెక్నో స్కూల్ విద్యార్థి క్రిస్టినా శారోస్, ద్వితీయ బహుమతి వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీ వైష్ణవి, తృతీయ బహుమతి బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థి లహరిలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లాజీగౌడ్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఆమనగల్లు రాజు, తెలంగాణ యూనియన్ ఫిలిం డ్యాన్సర్ ప్రభుశంకర్, ఆమనగల్లు జేఏసీ కన్వీనర్ శివలింగం, పాపిశెట్టి రాము, అధ్యాపకులు శర్మ, మహమూద్, శ్రీశైలం, చిక్కి, శివ, సాయి, ధనుశ్, శివరాజ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల ప్రారంభం




శంకర్‌పల్లి ఎంపీపీఎస్‌లో అదనపు తరగతి గదులు ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

చేవెళ్ల రూరల్, మార్చి 5 : శంకర్‌పల్లి మండల ప్రజా పరిషత్ బాలుర పాఠశాలలో రూ.30లక్షలతో జడ్‌ఎఫ్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ స్వచ్ఛంద సహకారంతో మూడు తరగతి గదులు, జలదంకి వెంకట కృష్ణ రౌండ్ టేబుల్ ఇండియా ఆర్థిక సౌజన్యంతో శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప ఎంపీయూపీఎస్‌లో రూ.7 లక్షలతో నిర్మించిన తరగతి గదిని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్‌ఎఫ్ టెక్ సెంటర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కృష్ణస్వామి జంబునాథన్, సంస్థ నిర్వాహకులు రాకేశ్ మిశ్రా, శివరాంకుమార్, సుధీర్, హర్షిత్‌సేథ్, లోకేశ్‌రెడ్డి, అఖిల్, చైతన్య, శంకర్‌పల్లి ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఉదయశ్రీ పాల్గొన్నారు.



## బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

షాబాద్, మార్చి 5: మండలంలోని కుమ్మరిగూడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్మిక విభాగం నాయకుడు కుమ్మరి శ్రీనివాస్‌కు పితృవియోగం కలిగింది. అతడి తండ్రి నర్సింహులు మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి బుధవారం కుమ్మరిగూడ గ్రామానికి వెళ్లి నర్సింహులు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం నర్సింహులు కుమారుడైన బీఆర్‌ఎస్ పార్టీ కార్మిక విభాగం నాయకుడు కుమ్మరి శ్రీనివాస్‌తో పాటు అతడి కుటుంబసభ్యులను అవినాశ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కేతన, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రమేశ్ యాదవ్, శ్రీశైలంయాదవ్, అవిలాశ్‌గౌడ్, నర్సింహులు, రవి, నర్సిరెడ్డి ఉన్నారు.

## అక్రమంగా మట్టి తరలింపు.. కేసు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

కేశంపేట, మార్చి 5: మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను కేశంపేట పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బైర్ఖాన్‌పల్లి గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం రావడంతో పెట్రోలింగ్‌లో ఉన్న కానిస్టేబుళ్లు అశోక్, మల్లేశ్‌ను ఘటనా స్థలానికి చేరుకొని మట్టి నింపుకొని ఉన్న టప్పర్‌తో పాటు ఖాళీగా ఉన్న మరో టిప్పర్‌ను గుర్తించారన్నారు. టిప్పర్లతోపాటు డ్రైవర్లు, యజమానిని అదుపులోకి తీసుకొని కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

మంచాల, మార్చి 5: కడుపునొప్పితో బాధపడుతున్న వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంచాల పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంచాల గ్రామానికి చెందిన నర్ల అంజయ్య(67) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం అంజయ్యకు కడుపు నొప్పి తీవ్రం కావడంతో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అంజయ్య మృతదేహాన్ని వెలికితీసి శవపరీక్ష నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అంజయ్యకు భార్యతో పాటు ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈమేరకు మంచాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన



నందిగామ, మార్చి 5: మండల పరిధిలోని బండోనిగూడ గ్రామం నుంచి మద్దూరు వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కొత్తూరు, నందిగామ ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, బండోనిగూడలో సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

## వినియోగంలోకి మార్కెట్ షెడ్డు

కందుకూరు, మార్చి 5 : ఎట్టకేలకు మార్కెట్ షెడ్డు వినియోగంలోకి వచ్చింది. ఎండకు ఎండి, వానకు నానుకుంటూ, రోడ్లపైనే కూరగాయలను విక్రయిస్తూ, కాలం వెళ్లబోసుకుంటూ క్రయ విక్రయదారులు బతుకీడుస్తున్నారు. ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే సబితా రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. కూరగాయలను రోడ్ల పైన విక్రయిస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వారికి శాశ్వతంగా షెడ్డు నిర్మించి ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరడంతో స్పందించిన ఆమె తక్షణమే రూ.29 లక్షల నిధులను మంజూరు చేశారు. దీంతో షెడ్డు నిర్మించి పూర్తి చేశారు. దీంతో ఎంతో కాలంగా ఉన్న సమస్య నెరవేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.